సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 18 । జనవరి । 2025



ఎట్టకేలకు మండల మీట్ నిర్వహణ

కురబలకోట మండల మీట్ ఎట్టకేలకు శుక్రవారం నిర్వహించారు. మూడు సార్లు వాయిదా పడిన తర్వాత నాలుగో సారి ఉత్కంఠ మధ్య జరిగింది. -IIలో



అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఒక వైపు అప్పులు, మరో వైపు మద్యానికి బానిసైన సీతక జయదేవ్(53) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 72 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అటవీశాఖాధికారులకు మానుపిల్లి అప్పగింత



మానుపిల్లిని అప్పగిస్తున్న పోలీసులు

రామాపురం: అడవి జంతువు మానుపిల్లి(చెట్టు పిల్లి)ని మండల ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులకు శుక్రవారం మండల పోలీసులు అప్పగించారు. రామాపురం-లక్కిరెడ్డిపల్లె రోడ్డు మార్గంలో రోడ్డుపక్కనే మానుపిల్లిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు చెట్టుపిల్లిని పట్టుకొని అటవీ అధికారులకు తెలియజేసి అప్పగించారు.

రెండుతలల గొర్రె పిల్ల



గొర్రె పిల్లతో యజమానులు

జమ్మలమడుగు: వైఎస్సార్‌జిల్లా జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని గుడ్ల నాగేష్ అనే వ్యక్తి గొర్రెలు, మేకలను పెంచుకుంటున్నారు. ఇతని ఇంట్లో రెండుతలలు, మూడు కన్నులు, మూడు కాళ్లతో గొర్రె పిల్ల జన్మించింది. శుక్రవారం ఓ గొర్రె వింత పిల్లకు జన్మనివ్వడంతో గ్రామంలో చాలా మంది దీనిని చూడటానికి వెళ్లారు. ఈ విషయం గురించి వెటర్నరీ అధికారులతో మాట్లాడగా జన్యులోపం వల్ల ఇలా జరుగుతుందని చెబుతున్నారు.

పాడిరైతుల కోసం గోకులం షెడ్లు



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల కోసం కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా పీడీ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మండలంలోని బండపల్లి పంచాయితీ వెంకటరెడ్డిగారిపల్లె గ్రామంలో రైతులు ఏర్పాటు చేసిన గోకులం షెడ్లను, సిమెంటు రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రతి పాడి రైతుకు షెడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలంలో గోకులాలు షెడ్లు మొత్తం 74 కాగా అందులో 51 పూర్తి చేశారని, 14 బేస్‌మట్టం లెవల్‌లో, 10 గ్రూప్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. ఈనెల ఆఖరిలోపు అన్నీ పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏ బాబు , రైతులు పాల్గొన్నారు.

టమాట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



టమాట సాగులో మెలకువలు తెలియజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

రాయచోటి (జగదాంబసెంటర్): టమాట పంట సాగు చేసిన రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం రాయచోటి మండలం దిగువఅబ్బవరం రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి రైతులకు, ఆర్‌ఎస్కె సిబ్బందికి ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ వాడకంలో మెలకువలు తెలియజేశారు. అనంతరం టమాట సాగు చేసిన పొలంలోనికి వెళ్లి ప్రత్యక్షంగా ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ వాడకంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల తెగుళ్లు, వాటి తీవ్రత , పురుగు మందుల నివారణ మెసేజ్‌లు వచ్చే విధానంపై రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శ్రీలత, మజీద్ అహమ్మద్, అశోక్‌రెడ్డి, ఏఓలు దివాకర్, మోహన్, సుచిత్ర, రాజు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు రైట్..రైట్

- అధికారం అండగా.. రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
- ఇటీవల వరుస క్రమంలో పట్టుబడుతున్నా భయపడని అక్రమార్కులు
- మంత్రి, ఎమ్మెల్యే మధ్య బియ్యం చిచ్చు
- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ దందా
- వెనకేసుకు వస్తున్న అధికార పార్టీ నేతలు



బెంగళూరు బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ గుర్రంకొండలో పట్టుబడిన బియ్యం లారీ (ఫైల్)

సాక్షి రాయచోటి: రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం జోరందుకుంది. అక్రమార్కులు యథేచ్ఛగా సరుకు సరిహద్దులు దాటిస్తున్నా నిఘా వ్యవస్థ నిద్రపోతోంది. లారీల్లో సరుకు సరిహద్దులు దాటుతోంది. ఇదేమని అడిగేవారు లేకపోగా...చేస్తున్నది తప్పని చెప్పేవారు లేకపోగా ఇష్టానుసారంగా దందా మూడు పువ్వులు, ఆరుకాయలు వెలుగొందుతోంది. అక్రమార్కులు గ్రూపులుగా ఏర్పడి సరుకు రవాణాను నిత్యకృత్యంగా మార్చారు. అందులోనూ అధికారం అండగా ఉండగా బియ్యం అక్రమ రవాణా మెండుగా సాగుతోంది. అన్నమయ్య జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాలో ఈ అక్రమ వ్యాపారం ఊపందుకుంది. రేషన్ డీలర్లు, ఎండీయూవాహనాల నుంచి తక్కువ ధర (కిలో రూ. 10–15)కు కొనుగోలు చేయడం, ఆ తర్వాత బెంగళూరు తదితర నగరాలకు పంపి రూ. 40–50లతో విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్న వ్యవహారం కలకలం రేపుతోంది.

పట్టుపడుతున్నా అదరని అక్రమార్కులు : అన్నమయ్య జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాలోనూ వరుసగా రేషన్ బియ్యం తరలిస్తూ అక్రమార్కులు పట్టుబడుతున్నా అదరడం లేదంటే అధికార పార్టీ అండదండలు బలంగా ఉన్నాయని చెప్పకనే చెప్పవచ్చు. పట్టుబడినా తమకు ఏమౌతుంది లే అన్న ధీమాతో ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. గత డిసెంబరు నెలతోపాటు ఈనెలలో కలిపి రాయచోటి, సంబేపల్లె, మదనపల్లె, కలకడ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున టన్నుల కొద్దీ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసు, రెవెన్యూ సిబ్బంది కొరడా ఝుళిపించి పలువురిపై కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ యథేచ్ఛగా సరుకు రవాణా మాత్రం కొనసాగుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. రోజువారి బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్న వారిపై పోలీసు, రెవెన్యూశాఖ మరింత నిఘా పెడితే పెద్ద ఎత్తున చౌక బియ్యాన్ని నల్లబజారుకు తరలించకుండా అడ్డుకోవచ్చని ప్రజలు సూచిస్తున్నారు.



టన్నుల కొద్దీ బియ్యం రవాణా



జిల్లాలోని బియ్యాన్ని అక్రమార్కులు కొనుగోలు చేసి టన్నుల్లో సరిహద్దులు దాటిస్తున్నారు. లారీల్లో సరుకును ప్రతినిత్యం పంపుతున్నా ఆకాశరామన్న ఫిర్యాదులతో పట్టుబడుతున్నాయే తప్ప లేకపోతే జిల్లాలు దాటిపోతున్నాయి. ఇటీవల ఉన్న చెక్‌పోస్టులు కూడా తీసి వేయడంతో ఇక తనిఖీలే లేకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట..పాడిందేపాటగా నడుస్తోంది.

మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే

బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో ఇటీవల గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేసి తరలించే ముఠాలు ఎక్కువయ్యాయి. అయితే అక్రమార్కుల మధ్య ఇటీవల అభిప్రాయభేదాలు వచ్చి అవి తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాయచోటి నియోజకవర్గానికి చెందిన వారితో పాటు పీలేరు నియోజకవర్గానికి చెందిన కొంతమంది మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గమనే పరిస్థితి నెలకొంది. దీంతో ఇటీవల కలకడతోపాటు మిగిలిన కొన్ని ప్రాంతాల్లో సరుకును అక్రమంగా తరలిస్తున్న వారిపై రాయచోటికి చెందిన ఈ వ్యాపారంలో ఉన్నవారు సమాచారం అందించడంతో పోలీసులు రెవెన్యూశాఖ వారిచే దాడులు చేయించి కేసులు నమోదు చేశారు. దీంతో అక్రమార్కుల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో రాయచోటి ప్రాంతానికి చెందిన అక్రమార్కులు సరుకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా పీలేరు ప్రాంతానికి చెందిన వారు కొంతమంది అక్రమ వ్యాపారులు పోలీసులకు సరుకు పట్టించేలా చేశారు. దీంతో పట్టుబడిన సరుకుతోపాటు వారిపై కేసులు లేకుండా విడిచిపెట్టాలని మంత్రి స్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇదే తరుణంలో అటువైపు నుంచి పీలేరు ఎమ్మెల్యే కూడా ఖచ్చితంగా కేసు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతో విడవమంటే పాముకు కోపం...కరవమంటే కప్పకు కోపం అన్నట్లు పోలీసుల పరిస్థితి మారింది.

నల్లబజారుకు రేషన్ బియ్యం



కలకడలో పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్ (ఫైల్)

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం నల్లబజారుకు తరలుతున్నాయి. ఈ ప్రాంతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి బెంగళూరుకు తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. సరుకు పెద్ద ఎత్తున తరలిపోతోంది. నల్లబజారుకు తరలించడమే లక్ష్యంగా ఎక్కడికక్కడ గద్దల్లా వాలిపోవులు కదుపుతున్న అక్రమార్కుల ఆట కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, మదనపల్లి ప్రాంతాలలో ఉన్న నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్షకు 1519 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు.

వర్క్‌కల్చర్‌తో క్వాలిటీ ఎడ్యుకేషన్



డాక్టర్ విష్ణువర్ధన్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రాయచోటి అర్బన్: వర్క్‌కల్చర్‌ను పాటించడం ద్వారానే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చునని పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్, రీసోర్స్‌పర్సన్ డి.విష్ణువర్ధన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల సభాభవనంలో కళాశాల అధ్యాపకుల కోసం ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడాలజీ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్క్ కల్చర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అధ్యాపకులు పని చేసే తత్వాన్ని, వృత్తిపట్ల నిబద్ధతను, అంకితభావాన్ని, సెల్ఫ్ డిసిప్లెయిన్, సమయపాలన, విజన్, సేవాతత్వం కలిగి ఉండాలని సూచించారు. ఎంప్లాయిమెంట్ స్కిల్స్‌ను విద్యార్థులలో పెంపొందించి ఉద్యోగ అవకాశాలు పొందేలా శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. ఇన్నోవేషన్స్, వ్యవస్థాపకత, అభివృద్ధి సెంటర్ ద్వారా విద్యార్థులకు నవకల్పనలు, స్టార్ట్–అప్స్ రూపొందించే విధంగా సంసిద్ధు లను చేయాలని కోరారు. అనంతరం డాక్టర్ విష్ణువర్ధన్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు



హాకీ క్రీడాకారులతో ఎమ్మెల్యే, తదితరులు



హాకీ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ హాకీ మైదానంలో శుక్రవారం 14వ ఎల్‌జి గిరిరావు ఏపీ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన హాకీ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మైదానంలో హాకీ స్టిక్‌తో ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. హాకీ క్రీడకు మదనపల్లె పుట్టినిల్లన్నారు. ఇదే మైదానంలో హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ హాకీ క్రీడను పరిచయం చేసి క్రీడను నేర్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఎంతో మంది క్రీడాకారులు హాకీలో జాతీయ,రాష్ట్ర స్థాయిలో ఆడి మదనపల్లెకు పేరు ప్రఖ్యాతులు తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు మదనపల్లెలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. త్రిలోకికర్ హాకీ గోల్డ్‌కప్ పోటీలు మళ్లీ నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. హాకీ మైదానంలో ఫ్లడ్‌లైట్లు, బోరు వేయిస్తానని, టర్ఫ్ కోర్టుగా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, ఏపీ హాకీ ప్రెసిడెంట్ బి.ఎం.చాణుక్యరాజ్, టోర్నమెంట్ డైరెక్టర్ రాజశేఖర్, బి.టి.కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, హాకీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పివి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, పీడీలు జీపీ రాజు, శివశంకర్ జలజ, కోచ్ నౌషాద్, హితేష్‌రావు, సీనియర్ హాకీ క్రీడాకారుడు మణి పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హాకీ పోటీలు మొదటి రోజు హోరీగా జరిగాయి. ప్రకాశం–అనంతపురం, చిత్తూరు–విజయనగరం, కర్నూలు–శ్రీకాకుళం, తిరుపతి–పార్వతిపురం మన్యం జిల్లాల మధ్య పోటీలు సాగాయి.

పండుగ వాతావరణంలో గణతంత్ర వేడుకలు

అధికారులతో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రిపబ్లిక్ డే నిర్వహణపై అధికారులతో సమీక్షి చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: అన్నమయ్య జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో ఈనెల 26న నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు వారికి కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖల ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్లను ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమీషనర్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటాద్రి, డీఆర్ఓ మధుసూదనరావు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛతాహీ సేవ'

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను ఈనెల 18న విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాన్నారు. జిల్లాలో ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛతాహీ దివాస్ కార్యక్రమాలను తప్పని సరిగా నిర్వహించాలన్నారు.

ఖాకీ సెటిల్‌మెంట్స్‌కు చెక్ పడేనా!

- కలెక్షన్'ఖాకీ'లలో మొదలైన వణుకు
- శాఖ ప్రక్షాళన దిశగా 'హెగ్డే' అడుగులు పడేనా
- మద్యం షాపుల సిట్టింగ్‌లకూ మామూళ్లు
- తెల్లవారే రాజంపేటలో మద్యం అమ్మకాలు
- గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, ల్యాండ్‌సెటిల్‌మెంట్స్
- ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే



సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయం



ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే

రాజంపేట: సబ్‌డివిజన్‌లో పలు స్టేషన్లలో యథేచ్ఛగా కొనసాగుతున్న అన్ని రకాల సెటిల్‌మెంట్స్‌కు చెక్‌పడేనా అని అందరూ చర్చించుకుంటున్నారు. ఐపీఎస్ అధికారి రాజంపేటకు ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే రాకతో ఇప్పుడు సబ్‌డివిజన్‌లో సెటిల్‌మెంట్ ఖాకీలలో వెన్ను వణుకుతోంది. ఖాకీల దొరల చేతిలో నష్టపోయిన బాధితులు ఐపీఎస్ అధికారిపై నమ్మకం పెట్టుకున్నారు. ఏంతవరకు ఇది ఫలిస్తుందో వేచిచూడాల్సిందే. సెటిల్‌మెంట్‌లో జేబులు నింపుకునే ఖాకీ బాస్‌లు పైకి నిజాయితీగా వ్యవహరించడమే ఇక్కడ కొసమెరుపు.

సబ్‌డివిజన్ ఇలా..

రాజంపేట సబ్‌డివిజన్‌లో రైల్వేకోడూరు, రాజంపేటటౌన్, రాజంపేట రూరల్, మన్నూరు సర్కిల్ ఉండగా, వీటి పరిధిలో నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు రూరల్, అర్బన్, చిట్వేలి , ఓబులవారిపల్లెతోపాటు రాజంపేట నియోజకవర్గ పరిధిలోని సుండుపల్లె, వీరబల్లి పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రాజంపేట సబ్‌డివిజన్‌లో జరిగిన ఖాకీల పాలన ఐపీఎస్ రాకతో మారుబోతున్నదనే సంకేతాలు ప్రజల్లోకి వెళుతున్నాయి. మరీ వేచిచూడాల్సిందేనని చెబుతున్నారు.

కలెక్షన్ల ఖాకీలలో వణుకు..

సబ్‌డివిజన్ పరిధిలో కొన్ని స్టేషన్‌లలోబాస్‌లకు కలెక్షన్ ఖాకీలుగా ఉన్న వారికి ఇప్పుడు వణుకు పుడుతున్నాయి. ఇప్పటి వరకు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో బాధితునికి అండగా కాకుండా, అవతలికి వ్యక్తికే అండగా నిలవడం జరుగుతుందంటే ఇందులో సెటిల్‌మెంట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయి. కలెక్షన్ ఖాకీలు మీడియేటర్‌గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారెవరెవరు అనేది విచారణలో వెల్లడికావాల్సి ఉంది. ఓ సర్కిల్ అధికారి ఏకంగా తనకు అనుకూలంగా కొందరు ఖాకీలను పెట్టుకొని సర్వం నడిపిస్తుంటారు. శాఖపరంగా ప్రక్షాళన దిశగా ఏఎస్పీ అడుగులు వేస్తారా? అన్నది హాట్‌టాపిక్‌గా మారింది.

మద్యం షాపుల సిట్టింగ్‌కు మాముళ్లా..!

మద్యం షాపుల సిట్టింగ్ పెట్టుకొని క్రయవిక్రయాలు చేసుకునే మద్యం షాపుల యజమానుల నుంచి మాముళ్ల వ్యవహారం నడుస్తోందని ఓపెన్‌గానే రాజంపేటలో చర్చించుకుంటున్నారు. స్థానిక బాస్ నుంచి చిన్న బాస్‌తో స్టేషన్‌బాస్‌కు ఇందులో వాటాలు ఉన్నాయని ప్రచారం జోరుగా సాగుతోంది. అబ్కారీ శాఖ ఖాకీల గురించి చెప్పనక్కర్లేదు. సిట్టింగ్‌కు ఖాకీలు, అబ్కారీ ఖాకీలు ఒక ఒప్పందంతో నడుస్తున్నాయి. ఈవిషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిబంధనలకు నీళ్లు వదిలారని కూటమినేతలలో తమ పార్టీ జనంలో పలుచబడిందని వాపోతున్నారు. రాజంపేట పట్టణంలో తెల్లవారగానే జనం చేతిలో మద్యంబాటిళ్లు కనిపిస్తున్నాయి. ఇందుకు కారకులెవరు అని ఆలోంచిచాల్సింది కూటమి ప్రభుత్వమే.

పనితీరు మారేనా?

తొలిసారిగా ఐపీఎస్ అధికారి రావడంతో రాజంపేట సబ్‌డివిజన్ పోలీసుశాఖ పనితీరు మారేనా అన్న అంశం చర్చనీయాంశంగా మారుతోంది. ఆరునెలల కాలంలో ఎర్రచందనం స్మగ్లింగ్, పలు స్టేషన్‌లలో ల్యాండ్‌సెటిల్‌మెంట్స్, గంజాయి అమ్మకాలు లాంటి కంటికి రెప్పచాటులు జరుగుతూ వస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. మట్టి, ఇసుక అక్రమరవాణా తదితరం యథేచ్ఛగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి అందిన నివేదికలే ఎస్‌డీపీఓ స్థానంలో ఏఎస్పీ నియమాకానికి కారణమా? అన్న సందేహాలు అధికారపార్టీలో ఆందోళన కలిగిస్తోంది.

ఏఎస్పీగా మనోజ్ రామనాథ్ హెగ్డే బాధ్యతలు

రాజంపేట తొలి ఏఎస్పీగా ఐపీఎస్ అధికారి మనోజ్ రామనాథ్‌హెగ్డే బాధ్యతలు స్వీకరించారు. కడప–రేణిగుంట నేషనల్‌హైవేలోని ఎర్రబల్లి ఉద్ద ఉన్న ఎస్‌డీపీఓ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో శాఖపరంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు. అందరి సహకారంతో శాఖపరంగా స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, వివిధ స్టేషన్లలో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తదితరం వాటిని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

'చేయూత'ను సద్వినియోగం చేసుకోవాలి

ఏపీజీజీ చైర్మన్ సత్యప్రకాష్‌సింగ్



రుణపథకం మెగా కీని అందజేస్తున్న చైర్మన్ సత్యప్రకాష్‌సింగ్

రాజంపేట టౌన్: ప్రజల ఆర్థికాభివృద్ధికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ తెలిపారు. పట్టణంలోని ఏపీజీబీ రీజనల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చైర్మన్, జనరల్ మేనేజర్ రాజేంద్రన్, రీజనల్ మేనేజర్ సుకాంత కుమార్ స్వార్ చేతుల మీదుగా రుణ పథకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ మాట్లాడుతూ రుణపథకాల లబ్ధిదారులు తమ వ్యాపారాభివృద్ధిని ఎప్పటికప్పుడు పెంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. లబ్ధిదారులు క్రమం తప్పకుండా రుణాలకు సంబంధించిన కంతులు చెల్లిస్తే ఎంత పెద్దమొత్తంలోనైనా తమ బ్యాంక్ రుణాలు ఇస్తుందన్నారు. రుణాలు తీసుకున్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు శ్రమించాలన్నారు. వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు సాంకేతికతను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే నమ్మకమే వ్యాపారులకు పెద్దపెట్టుబడి అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలను తమ బ్యాంక్ ఇస్తుందన్నారు. ఈసందర్భంగా రూ.5 కోట్ల విలువ చేసే రుణపథకాలను 25 మందికి అందజేశారు. కార్యక్రమంలో సరళ రుణకేంద్రం చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీజీబీ వివిధశాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

మదనపల్లె : పశువులను కబేళాకు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. శుక్రవారం మదనపల్లె బైపాస్‌రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా, అనంతపురం వైపు నుంచి వచ్చిన ఓ లారీని తనిఖీ చేయగా అందులో గేదెలు, ఎద్దులు రవాణా చేస్తున్నట్లు గుర్తించామని ఎస్‌ఐ పేర్కొన్నారు. తరలిస్తున్న వ్యక్తులను వివరాలు కోరితే, పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న కేరళ పాలక్కాడ్‌కు చెందిన మదన్‌కుమార్(38), మన్నూర్‌కు చెందిన సాల్మన్(54), సత్యసాయిజిల్లా నల్లచెరువుకు చెందిన లతీఫ్(35)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పశువులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫారం-1 సమర్పించాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా నియమం 2010 ప్రకారం ఫారం–1 సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పాఠశాల విద్యా డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వంచే గుర్తింపు పొందినవారు, గుర్తింపు అవసరమైన వారు సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో ఫారం–1 తీసుకొని అందులో పొందుపరిచిన వాటి వివరాలు తెలియజేయాలని చెప్పారు.

రేపు ఏపీజీఈఏ మహాసభ

కడప రూరల్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘురామ నాయుడు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో..

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య రాష్ట్ర మహాసభ ఈనెల 19న ఆదివారం నంద్యాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు ప్రతి జిల్లా నుంచి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తప్పక హాజరవుతారని, మన జిల్లాతోపాటు కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున సభ్యులు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు కురబలకోట మండల మీట్

- మూడు సార్లు వాయిదా తర్వాత విజయవంతం
- హైకోర్టు ఆదేశాలతో పటిష్ట బందోబస్తు

కురబలకోట : కురబలకోట మండల మీట్ ఎట్టకేలకు శుక్రవారం జరిగింది. మూడు సార్లు వాయిదా పడిన తర్వాత నాలుగో సారి ఉత్కంఠ మధ్య జరిగింది. హైకోర్టు ఆదేశాలతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి చిన్నపాటి సంఘటనలు కూడా లేకుండా ప్రశాంతంగా ముగియడంతో.. అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో మెజారిటీగా 11 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, ఒక ఇండిపెండెంట్ ఎంపీటీసీ ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండల మీట్ నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గతేడాది జూలై 12న మండల మీట్ జరగాల్సి ఉండగా.. కూటమి శ్రేణులు అడ్డుకోవడంతో వాయిదా పడింది. మళ్లీ అదే నెల 19న మండల మీట్‌కు కోరం సభ్యులు హాజరైనా కోరం లేదని వాయిదా వేశారు. అయితే మెజారిటీ సభ్యులతో కోరం ఉండటం, ఆపై రిజిస్టర్‌లో సభ్యులు సంతకాలు కూడా చేసి ఉండటంతో కోరం ఉన్నట్లు ఆ తర్వాత నిర్ధారించి నివేదికలు పంపారు. తిరిగి అక్టోబరు 18న మండల మీట్ నిర్వహించాల్సి ఉండగా.. మళ్లీ కూటమి శ్రేణులు అడ్డుకోవడంతో కోరం లేక వాయిదా పడింది. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి.



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బి.దస్తగిరి



మండల మీట్‌కు హాజరైన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు

అభివృద్ధి కోసం కలిసి సాగుదాం : ఎంపీపీ

హైకోర్టు ఆదేశాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల మీట్‌కు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల నుంచి 150 మందికి పైగా సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. సభ్యులు, అధికార ఉద్యోగులను మాత్రమే మండల మీట్‌కు అనుమతించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది సభ్యులతో పాటు ఇండిపెండెంట్ సభ్యుడు వైజీ సురేంద్ర హాజరయ్యారు. సంపూర్ణ కోరం లభించింది. చింతమాకులపల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ మాత్రం హాజరు కాలేదు. ఐదుగురు కూటమి నాయకులు మాత్రం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎంపీపీ బి.దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారం శాశ్వతం కాదని ప్రజా సంక్షేమాన్ని వివిధ అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని సమావేశాలకు ఆటంకం కల్గించరాదని ఎంపీపీ బి.దస్తగిరి అన్నారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక కృషి చేశారన్నారు. ఊరూరా రోడ్లు వేయించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చేసి చూపించారన్నారు. అదే విధంగా మండల ప్రగతిలో భాగంగా కూటమి నాయకులు మండల మీట్ నిర్వహణకు సహకరించడం శుభపరిణామమన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాజకీయాలు చూడరాదన్నారు. ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుదామన్నారు. మండల మీట్ సజావుగా జరగడానికి సహకరించిన నాయకులు, అధికార యంత్రాంగం మరో వైపు పోలీసులతోపాటు ప్రతి ఒక్కరికీ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మండల మీట్‌లో కనసాని వారిపల్లె వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముదివేటి ఆనంద రెడ్డి వివిధ సమస్యలపై సభలో గళమెత్తారు. ఆ గ్రామ సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి కూడా సమస్యల పరిష్కారం కోసం సభ దృష్టికి తీసుకు వచ్చారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ బైసాని జ్యోతి పాల్గొన్నారు. డీఎస్పీ కొండయ్య ఆదేశాలతో రూరల్ సర్కిల్ సీఐ రమేష్ పర్యవేక్షణలో ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద భారీగా పోలీసుల మోహరింపు

విద్యుదాఘాతంతో రూ.50 వేల నష్టం

చిట్వేలి : చిట్వేలి సింగనమల వీధి (జెండా మాను) దగ్గర శుక్రవారం తెల్లవారుజామున 11కేవీ విద్యుత్ లైన్ తెగి షేక్ సాబేరా రేకుల గృహంపై పడింది. ఇంటిలోని ఫ్రిజ్, ఫ్యాన్‌లు, లైట్లు, స్విచ్‌బోర్డు వంటి సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. తమకు పరిహారం ఇప్పించాలని ఆమె కోరారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ములకలచెరువు : స్థానిక రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కదిరి రైల్వే ఇన్‌చార్జి ఎస్‌ఐ మహబూబ్‌బాషా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 70 ఏళ్ల వృద్ధుడు తరుచూ రైల్వేస్టేషన్‌లోనే ఉండే వాడు. స్థానికంగా భిక్షాటన చేసి రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్‌కి వచ్చి నిద్రపోయేవాడు. ఆరోగ్యం దెబ్బతినడంతోనే వృద్ధుడు చనిపోయాడని పోలీసులు తెలిపారు. వృద్ధుడి జేబులో తనకల్లు నుంచి ములకలచెరువుకు ఆర్టీసీ బస్సులో వచ్చినట్లు టికెట్టు ఉందని వారు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

బేల్దారి కుటుంబంపై టీడీపీ వర్గీయుల దాడి

నామమాత్రపు కేసు పెట్టారంటూ బాధితుల ఆవేదన

రాజంపేట : రాజంపేట మండలం ఉప్పరపల్లెలో టీడీపీ వర్గీయులు.. గ్రామస్తుడు, బేల్దారి పని చేసుకునే మీసాల వెంకటేశు ఇంటిపై దాడి చేసిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ గొడవకు మురికినీటి నిల్వలపై మట్టి పోసి పూడ్చడమే కారణంగా చూపుతున్నా.. టీడీపీ వర్గీయులు పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని దౌర్జన్యానికి దిగినట్లు గ్రామస్తులు చెప్పుకొంటున్నారు. బేల్దారి కూలి మీసాల వెంకటేశుకు సంబంధించిన వారిపై దొంతం ఈశ్వరయ్యకు చెందిన సుమారు 24 మంది మూకుమ్మడిగా దాడి చేశారు. మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. తనను రక్షించుకునేందుకు బాధితుడు తమ వారితో తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు అంటున్నారు. వీరంతా ఒకటే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం.



ఉప్పరపల్లెలో విచారణ చేస్తున్న పోలీసు

ఉప్పరపల్లెలో ఉద్రిక్తత

ఉప్పరపల్లెలో ఉద్రిక్తతగా పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లాఠీలతో చెదరగొట్టారు. కాగా గతంలో ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. కేసులు కూడా నమోదయ్యాయి. అయినప్పటికీ అదేమి లెక్క చేయకుండా ఘర్షణకు దిగారంటే, వీరి వెనుక టీడీపీ స్థానిక నేత హస్తం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రపు కేసుతో..

మీసాల వెంకటేష్ సంబంధీకులపై 25 మంది టీడీపీ వర్గీయులు దాడి చేస్తే మన్నూరు పోలీసులు నామమాత్రపు కేసు కట్టి చేతులు దులుపుకొన్నారని బాధిత వర్గీయులు వాపోతున్నారు. పైగా మన్నూరు పోలీసుస్టేషన్ వద్ద మకాం వేసి టీడీపీ నేత గంపశివ తమపై దాడి చేసిన వారితో రాజీ కావాలని ఒత్తిడి చేస్తున్నారని మీసాల వెంకటేశు మీడియాకు తెలిపారు. టీడీపీ నేత ఒత్తిడికి పోలీసులు తలొగ్గారని విమర్శలు వెలువడ్డాయి.

'నా పంటను దున్నేశారు'



బాధితుడు సిద్దారెడ్డి

బ్రహ్మంగారిమఠం : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సొంత పంచాయతీ పలుగురాళ్ళపల్లె సమీపంలోని బొగ్గులవారి పల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయుడు శీలం సిద్దారెడ్డికి చెందిన పైరు ఉన్న భూమిని శుక్రవారం ఎర్రంపల్లెకు చెందిన సిద్దయ్య యాదవ్ మేకల పుల్లయ్య యాదవ్‌లు దున్నినట్లు బాధితుడు తెలిపారు. శుక్రవారం సిద్దారెడ్డి విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. పలుగురాళ్ళపల్లె పొలం సర్వే నంబర్ 825లో 2.50 ఎకరాలు తమ పిత్రార్జితం భూమి అని పేర్కొన్నారు. సర్వే నంబర్ 826లో 2 ఎకరాలు ఎర్రంపల్లెకు చెందిన లగసాని వీరయ్య దగ్గర అదే గ్రామానికి చెందిన మేకల పోలయ్య కొనుగోలు చేశాడన్నారు. దాదాపు 5 ఏళ్ల నుంచి తనకు ఉన్న భూమిలో అర్ధం ఆయన భూమి ఉందంటూ.. తనపై దౌర్జన్యం చేస్తూ వస్తుంటే అడ్డుకుంటూ వస్తున్నామన్నారు. సర్వే చేయించుకోవాలని తెలిపినా వినడం లేదని, ఇప్పటికే సర్వే కోసం మేకల పుల్లయ్యకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. అయినా రాకుండా ఉన్నారన్నారు. ప్రస్తుతం తాను పంటను వేశానన్నారు. టీడీపీ అధికారంలో ఉందని, ఎమ్మెల్యే తమ్ముడు పుట్టా ఆనంద్ చెప్పాడని శుక్రవారం ఉదయం.. తాము లేని సమయంలో పైరు ఉన్న పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసి అడ్డుకోవడానికి తాము అక్కడికి వెళ్లే లోపు కొంత దున్నేసి వెళ్లిపోయారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పొలం ఎవరిది ఎంత వరకు అనేది సర్వే చేయించుకోవాలని సిద్దారెడ్డి కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : ఒక వైపు అప్పులు, మరో వైపు మద్యానికి బానిసైన సీతక జయదేవ్ (53) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు భానుప్రకాష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ కాయలవాండ్లపల్లికి చెందిన జయదేవ్ తిరుపతిలో పండ్ల వ్యాపారం చేస్తుండే వాడు. కట్టుకున్న భార్యను 10 ఏళ్ల క్రితం వదిలేసి మరో వితంతు మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. అలాగే అప్పుల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ కోసం ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని లోలోపలే కుమిలిపోతూ పలువురికి తన గోడు చెప్పుకొన్నాడు. తనకు చావే శరణ్యం అని నిర్ధారించుకుని గురువారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. గ్రామస్తులు అడ్డుకుని అతనిలో మనోధైర్యం నింపారు. అయినా శుక్రవారం వేకువజామున కాయలవాండ్లపల్లి సమీపంలోని చింతచెట్టుకు డ్రిప్ పైపుతో గొంతుకు బిగించి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రవికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.



జయదేవ్ మృతదేహం

ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెకు చెందిన జయప్ప కుమారుడు శంకర(38) భవననిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం అతడి భార్య లక్ష్మి, కుటుంబ సమస్యలతో అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పలుమార్లు కాపురానికి రావాల్సిందిగా కోరినా, ఆమె రాకపోవడంతో శంకర తీవ్ర మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లాలోని బీసీ, ఈబీసీ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన లబ్ధిదారులకు రాయితీ రుణాల దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ఈడీ జయసింహ శుక్రువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

గల్లంతైన యువకుడు మృతి



క్వారీ నీటి గుంతల్లో గాలిస్తున్న ఎస్‌డీఎస్ టీమ్ సభ్యులు

- మూడు రోజుల తరువాత మృతదేహం వెలికితీత
- ఈత కోసం క్వారీ గుంతల్లోకి వెళ్లి మృత్యువాత



వెంకటరత్నం మృతదేహం



వెంకటరత్నం (ఫైల్)

గుర్రంకొండ : క్వారీ నీటి గుంతల్లో ఈత కొడుతూ.. గల్లంతైన యువ ఇంజినీర్ మృత్యువాత పడ్డాడు. మూడు రోజుల నుంచి రెస్క్యూ టీమ్ సభ్యులు గాలిస్తూ.. ఎట్టకేలకు మృతదేహాన్ని బయటికి తీశారు. కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కనవారిపల్లెకు చెందిన బి.సూరి కుమారుడు బి.వెంకటరత్నం(24) లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకొని ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. లండన్‌లోనే ఉద్యోగం రావడంతో మరో 15 రోజుల్లో చేరడానికి సన్నాహాలు చేసుకొన్నాడు. ఈ నెల 15న సంక్రాంతి సందర్భంగా స్నేహితులతో కలసి క్రికెట్ ఆడిన తర్వాత.. ఈతకు వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. చుట్టుపక్కల బావులు లేకపోవడంతో గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె సమీపంలోని క్వారీ నీటి గుంతల్లోకి వచ్చారు. ఈత కొడుతూ ఉన్నట్టుండి నీటి గుంతల్లో మునిగిపోయాడు. స్నేహితులు కుటుంబ సభ్యులకు విషయం తెలపడంతో అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు రెండు రోజుల పాటు వాల్మీకిపురం, పీలేరు, రాయచోటి రెస్క్యూ టీమ్ సభ్యులతో క్వారీ గుంతల్లోని నీటిలో యువ ఇంజినీర్ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి ఎస్‌డీఎస్ టీమ్‌ను పిలిపించారు. రెస్క్యూ టీమ్ సభ్యులు ఉదయం క్వారీ నీటి గుంతల్లో తమ సామగ్రితో వెళ్లి యువ ఇంజినీర్ మృతదేహాన్ని ఎట్టకేలకూ బయటకు తీశారు. అప్పటికే క్వారీ వద్దకు పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు చేరుకొన్నారు. మృతదేహం బయటకు రాగానే కుటుంబ సభ్యులు బోరున రోదిస్తూ కుప్పకూలిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ మధురామచంద్రుడు వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా యువ ఇంజనీర్‌మృతితో చొక్కనవారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న ఏపీ సబ్ జూనియర్ హాకీ బాలుర చాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీలకు వైఎస్‌ఆర్ జిల్లా జట్టు పయనమైంది. కడప నగరంలోని వైఎస్సార్ ఇండో స్టేడియంలో జిల్లా బాలుర జట్టుకు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.శేఖర్ క్రీడా దుస్తులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో హ్యాట్రిక్ విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అలాగే డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, చైర్మన్ శ్రీనివాసులు, ప్రెసిడెంట్ రవిచంద్ర, ప్రవీణ్‌కిరణ్, సీనియర్ క్రీడాకారులు శ్యాముల్, సందీప్‌రాజు వారికి అభినందనలు తెలిపారు.

బెరైటీస్‌ను కొల్లగొడుతున్న టీడీపీ నేతలు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని టిఫిన్ బెరైటీస్‌ను టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆరు నెలల వ్యవధిలోనే అరాచకాలు ఎక్కువయ్యాయని, తనపైన అవినీతి ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, చిన్నప్ప, వరప్రసాద్, హాలు గంగాధరరెడ్డి, రసూల్, వేల్పుల గ్రామంలోని రైతులు, నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి మాట్లాడుతూ 'నిజాయితీగా బతుకుతుంటే నా మీద బురద జల్లే ప్రయత్నం చేస్తారా, నీవు మోసం చేయడం వల్లే ఏజెంట్‌గా తొలగించారు' అని టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డిపై మండి పడ్డారు. వ్యవస్థలన్నీ నాశనం చేసి దోచుకో, దాచుకో అన్న రీతిలో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. 'టిఫిన్ బెరైటీస్ ఏజెంట్‌గా పార్థసారథిరెడ్డి ఉన్నది వాస్తవమేనని, కానీ ఆయన నట్టు, బోల్టులను అమ్ముకుని మోసం చేయడం వల్లనే ఏజెంట్‌గా తప్పించి 2015లో నన్ను పెట్టారు' అని, ఎర్రగుంట్ల ఖనిజ వనరుల శాఖ వారే ఏజెంట్‌గా జారీ చేసిన నియామక పత్రాన్ని మీడియాకు చూపించారు.

కోట్ల సరుకు చోరీపై ఫిర్యాదు

'ఆ తర్వాత టిఫిన్ కంపెనీ దివాలా తీయడంతో అప్పుల వాళ్లంతా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లారని, అక్కడ ఆ ట్రిబ్యునల్ తీర్మానం చేసి ఏజెంట్‌గా వాసుదేవన్‌ను నియమించారని, వాసుదేవన్‌నే 2019లో నన్ను కేర్ టేకర్‌గా నియమించారు' అన్నారు. బెంగళూరుకు చెందిన ఎంబీసీ గ్రూప్ కంపెనీ హక్కులను పొందిందని ఆ కంపెనీ డైరెక్టర్ ధర్మలింగం నన్ను కేర్ టేకర్ ఏజెంట్‌గా కొనసాగించారన్నారు. అందుకు సంబంధించిన నియామక పత్రాలను మీడియాకు చూపించారు. ఈ నెల 13 ,14వ తేదీన రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువ చేసే ఖనిజాల సరుకును దొంగలించారని, అందుకు సంబంధించి కంపెనీ ఏజెంట్ అయినందున ఆ దొంగతనం గురించి పోలీసు అధికారులకు, మైన్స్ అధికారులకు, అలాగే కంపెనీ వారికి తెలియజేశానన్నారు. వాస్తవాలు తెలియకుండా ఇష్టమొచ్చినట్లు మీడియా ముందు మాట్లాడటం మంచిది కాదన్నారు. వేల్పులలో నేను రెండు మైన్సులు చేసిన మాట వాస్తవమే అని, కానీ లీజు ఉన్న మైన్స్‌లను మేము చేశామన్నారు. వేల్పులలో మైన్స్ యజమానులైన సుకర్ బాషా, విశ్వంశెట్టిలను బెదిరించి రూ.50 లక్షలు దోచుకున్నారని చెప్పడం అవాస్తవమన్నారు. అలాగే అశోక్ కంపెనీ వారితో రూ.30 కోట్లు తీసుకున్నానని చెప్పడం కూడా అవాస్తవమేనని, వీటిపై నేను ప్రమాణం చేయడానికి సిద్ధమన్నారు.



మాట్లాడుతున్న వేల్పుల రామలింగారెడ్డి

అధికారుల నుంచి స్పందన కరువు

మా తండ్రి మరణం ప్రమాదమని నాకు, మా కుటుంబ సభ్యులకు తెలుసు అని.. మా తండ్రిని కోడిని కోసినట్లు కోశారని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. కుటుంబంలో విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే స్వార్థపరుడు పార్థ అని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కోట్ల రూపాయలు విలువ చేసే ఖనిజాలన్నీ దొంగలించబడ్డాయని, వాటిని ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు. బెరైటీస్‌ను కాపాడేందుకు అనేక సార్లు అధికారులకు రక్షణ కల్పించాలని వినతి పత్రాలు పెట్టామని, కానీ ఎవరూ స్పందించలేదన్నారు. రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువైన సరుకును కూటమి నాయకులు రాత్రికి రాత్రే తరలించారన్నారు. ఎంబీసీ గ్రూప్ ద్వారా ఎంత స్టాక్ వచ్చిందనే విషయాన్ని కూడా కోర్టుకు తెలిపామన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి

వేముల మండలంలో నేను దోచుకుని ఉంటే నా వెంట ప్రజలు ఉండేవారు కాదని, ఎప్పుడు నా వెంటే ఉంటారన్నారు. వేల్పులలో నాలుగు సార్లు సర్పంచ్‌గా గెలిచామని, ఇప్పటికీ మా గ్రామంలో నేను సూచించిన వ్యక్తి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గెలుస్తున్నారని, ఇదే నా వెంట ప్రజలు ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులు చాలా మంచివారని, వారి కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధమన్నారు. నెలలో 20 రోజులు కుటుంబానికి దూరంగా ఉండి పనులు చేసుకుంటున్నానని, నా టర్నోవర్ రూ.110 కోట్లు ఉందని, నాది తెరిచిన తెల్లని కాగితమని, ఎప్పుడైనా విచారణ చేయించుకోవచ్చని, నా వద్ద అన్నింటికీ ఆధారాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని అసంబద్ధమైన మాటలు మాట్లాడడం సరికాదని, హత్య రాజకీయాలను మానుకోవాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం



ప్రేమ్‌సాగర్

కడప ఎడ్యుకేషన్ : అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో వైవీయూకు కాంస్య పతకం లభించింది. యోగివేమన క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య విభాగ అధిపతి కొవ్వూరు రామసుబ్బారెడ్డి శుక్రవారం క్రీడాకారుడిని అభినందించి, వివరాలు వెల్లడించారు. జలంధర్‌లో జనవరి 15 నుంచి 21వ తేదీ వరకు యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలలో యోగివేమన విశ్వ విద్యాలయ చాంపియన్ లిఫ్టర్ పోటీలలో దేవరకొండ ప్రేమ్‌సాగర్ 81 కేజీల విభాగంలో సత్తా చాటి వేమన విశ్వ విద్యాలయానికి కాంస్య పతకం సాధించి పెట్టారని తెలిపారు. ఈ క్రీడాకారుడు సీఎస్ఎస్ఆర్, ఎస్‌ఆర్‌ఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలల్లో విద్యను అభ్యసించారని చెప్పారు. ఈయన స్నాచ్‌నందు 140 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌స్థాయిలో 166 కేజీల బరువును ఎత్తి మొత్తం 306 కేజీలతో జాతీయ స్థాయిలో బ్రాంజి మెడల్ సాధించాడని చెప్పారు. ఇదే క్రీడాకారుడు దక్షిణ, పశ్చిమ మండల విశ్వ విద్యాలయాల పోటీలలో విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించి అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు అర్హత సాధించాడన్నారు. ఈ సందర్భంగా వైవీయూ ఉపకులపతి, క్రీడాబోర్డు చైర్మన్ ఆచార్య కృష్ణారెడ్డి క్రీడాకారుడిని అభినందించి రాబోయే ఖేలో ఇండియా పోటీలకు వైవీయూ తరఫున భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. వైవీయూ కులసచివులు ఆచార్య పుత్తపద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డిలు క్రీడాబోర్డు, శిక్షకులు, టీమ్ మేనేజర్ ప్రసాద్‌రెడ్డిని అభినందించారు.